ఐటీ కారిడార్‌లో రోడ్లను అద్దంలా తీర్చిదిద్దాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



ఇంజనీరింగ్, యూబీడీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: చెత్త కుప్పలు, వ్యర్థాలతో ముక్కు మూసుకునే పరిస్థితి రానివ్వమని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలి ప్రధాన రహదారి, శిల్పాస్టే ఓవర్‌పై పారిశుద్ధ్యం పనులను ఆయన కాలినడకన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను శుభ్రం చేసిన అనంతరం వెంటనే చెత్త కుప్పలను తొలగించాలని సూచించారు. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, కూడళ్లలో మట్టి, ఇసుకను ఏరోజుకారోజు తొలగించాలన్నారు. డీసీ నుంచి కింది స్థాయి అధికారుల వరకు పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించాలన్నారు. లోటుపాట్లను సవరించుకుంటూ ఐటీ కారిడార్‌లోని రోడ్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ రజనీకాంత్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

శేరిలింగంపల్లి జోన్ పరిధిలో రహదారులపై వరద నీరు నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, యూబీడీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ లాగింగ్ పాయింట్లతో పాటు ట్రాఫిక్ అంతరాయంగా పాత్ హోల్స్‌ను వెంటనే పూడ్చాలని, గుంతలు పూడ్చకుంటే సంబంధిత అధికారులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియంలో, కూడళ్లలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని, చెట్ల సంరక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. చెరువులలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ ఎస్‌ఈ శంకర్, ఈఈలు, డీఈలు, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.

‘వాయిస్ ఆఫ్ ది వేవ్స్’ఎగ్జిబిషన్



ప్రదర్శనను తిలకిస్తున్న కళాకారులు అంజుపొద్దార్, జయంతిరెడ్డి, పార్వతీరెడ్డి



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం వాయిస్ ఆఫ్ ది వేవ్స్ పేరిట రమణి మైలవరపు చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను కళాకారులు అంజుపొద్దార్, డాక్టర్ జయంతిరెడ్డి, పార్వతీరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఫొటో చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. 4 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 20 డిజిటల్ వర్క్‌లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. జాలరులు చేపలు పట్టే విధానాన్ని, గ్రామీణ వాతావరణాన్ని చిత్రాల ద్వారా చూపించారని తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



వైద్య విద్యలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు



ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న దిల్షాన్ షుకూర్, అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్ సీఈఓ శ్రీనివాసరావు

గచ్చిబౌలి: వైద్య విద్య అందించడంలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు ఉందని ఆ దేశంలోని టురోన్ జర్మెడ్ యూనివర్సిటీ చైర్మన్ దిల్షాన్ షుకూర్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంబీబీఎస్ ప్రవేశాల వివరాలను వెల్లడించారు. అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అనుబంధ సంస్థ అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్‌లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని అందిస్తుందన్నారు. ఉజ్బెకిస్తాన్ యూనివర్సిటీలో నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్ సీఈఓ శ్రీనివాసరావు పొలిజల, గ్వాంటేజ్ గ్రూపు చైర్మన్ గజన్ ఫర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో బోనాల జాతర ప్రారంభం



పెద్దమ్మ ఆలయంలో భెల్ అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం భెల్ ఫైనాన్స్ డైరెక్టర్ ఆర్.కే. ద్వివేది, ఈడీ కే.బి.రాజాలు బోనాల వేడుకలను ప్రార ంభించారు. 3రోజుల పాటు వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పెద్దమ్మ తల్లి దీవెనలతో భెల్ పరిశ్రమ అభివృద్ధి బాటలో సాగుతున్నదని పేర్కొన్నారు. అలాగే భెల్‌లో జరిగిన ముఖ్య సమావేశంలో పా ల్గొన్న సీఎండీ కే.ఎస్. మూర్తి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈడీ పీఈఅండ్‌ఎస్‌డీ శ్రీనివాస్‌రావు, జీఎం (హెచ్‌ఆర్) ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రధానరోడ్డు గుంతలమయం

లింగంపల్లి అండర్‌బ్రిడ్జి సమీపంలో బాక్స్‌టైప్ కల్వర్టు వద్ద ఇదీ పరిస్థితి



శేరిలింగంపల్లి: తారానగర్–లింగంపల్లి ప్రధానరోడ్డులో నిత్యం అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగంపల్లి అండర్‌బ్రిడ్జి సమీపంలో నిర్మించిన బాక్స్‌టైప్ కల్వర్టు వద్ద రోడ్డంతా గుంతలమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నీరు నిలిచిపోయి గుంతలు మరింత పెద్దవి అవుతున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



గుర్రపు డెక్క.. పిచ్చిమొక్క

ఇదీ పటేల్ చెరువు దుస్థితి • ఐదేళ్లు గడుస్తున్నా అభివృద్ధి జాడలేదు

మియాపూర్: మియాపూర్ పటేల్ చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ చెరువు సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. చెరువు మురుగుమయంగా మారడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ముందుకుసాగడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల నిధులు కేటాయించి కొంతమేర పనులు చేసి వదిలేశారు. చెరువు చుట్టు పచ్చదనం, ఎల్‌ఈడీ లైట్లు, వాకింగ్ చేసేందుకు ప్రత్యేక వాకింగ్‌ట్రాక్‌లు వెరసి మియాపూర్ పటేల్ చెరువు అభివృద్ధిపై సుమారు ఐదు సంవత్సరాల క్రిందట ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పిన మాటలు.. ఐదు సంవత్సరాలు గడిచిపోయినా అభివృద్ధి మాత్రం కానరావడం లేదు.

రూ.12కోట్లు కేటాయింపు

మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువుకు ఓవైపు జాతీయ రహదారి, మూడు వైపులా కాలనీలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువును అభివృద్ధి చేయడానికి రూ.12కోట్లు కేటాయించారు. దీంతో పరిసరప్రాంతాలవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రారంభంలో కొన్నిరోజుల పాటు పనుల్లో వేగం పెరగడంతో మంచి వాతావరణం అందుబాటులోకి వస్తుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ చెరువు అభివృద్ధి పేరుతో నీటిని ఖాళీ చేసి చుట్టూ మట్టిపోసి చెరువుకట్టను ఏర్పాటు చేశారు. టీఎస్‌నగర్ కాలనీ వైపు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మురుగు నీరు మళ్లించేందుకు పైపులైన్ పనులు చేపట్టినా వాటిని అసంపూర్తిగా వదిలేశారు. గతంలో సాయంత్రం పూట వాకింగ్ చేసేందుకు చుట్టు పక్కల కాలనీలవాసులు వచ్చేవారు. తర్వాత సరైన నిర్వహణ లేకపోవడం, పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో చెరువుకట్టపై పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెరువుల్లో గుర్రపు డెక్క పెరిగిపోయింది. దీనికితోడు అపార్టమెంట్ల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి చేరుతుండడంతో మురికి కూపంగా మారింది. దోమలు ప్రబలడంతో ప్రజలు రావడం మానేశారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకట్టపై దట్టమైన చెట్లు పెరిగిపోవడంతో చెరువుకట్ట బురదమయంగా మారి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. ఇక జాతీయ రహదారివైపు పటేల్ చెరువు బఫర్‌జోన్‌లలో కొంతమంది గుడిసెలు వేసి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. వర్షాకాలం కావడంతో చెరువులోకి స్వచ్ఛమైన నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువులో కలుస్తున్న మురుగునీరు



చెరువుకట్టపై పెరిగిన పిచ్చిమొక్కలు

శాకంబరిగా ఎదురుగడ్డ మైసమ్మ



రాయదుర్గం: మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయల దండలను అమ్మవారికి అలంకరించారు. అర్చనలు, పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సామాన్యులు ఇబ్బందిపడకుండా చూడాలి

ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్



బంజారాహిల్స్: వీఐపీలు ప్రధాన రూట్లలో ప్రయాణించే సమయంలో సామాన్యులు ఇబ్బందిపడకుండా తగు చర్యలు తీసుకోవాలని పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జంక్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు తగు సూచనలు చేశారు. వీఐపీలు అవతలి వైపు ప్రయాణిస్తున్నప్పుడు ఇటు వైపు ఉన్న ప్రజలను ఆపవద్దని వారిని యధావిధిగా ముందుకు వెళ్ళనివ్వాలని సూచించారు. లేదంటే రెండు వైపులా ట్రాఫిక్ స్తంభించిపోతున్నదని సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ,ఒక వైపు ట్రాఫిక్ వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నీటి నిల్వలను తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, సిబ్బంది

శంషాబాద్: ఫ్రైడే డ్రైడేలో భాగంగా పట్టణంలోని వివిధ బస్తీల్లో మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు పర్యటించారు. ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలను తొలగించాల్సిందిగా సూచించారు. కూలర్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు, ఇంటిపై కప్పులు ఇతర ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటి ద్వారా వచ్చే దోమలతో డెంగీ, మలేరియా వ్యాధులు వస్తాయని ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అనిల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవితం ఓ సుదీర్ఘ ప్రయాణం

ప్రొఫెసర్ మీర్ అలీ హుస్సేన్



గ్రాడ్యుయేట్లకు పట్టాలను అందజేసిన ప్రొ.మీర్ అలీ హుస్సేన్ తదితరులు

మాదాపూర్: జీవితం ఓ సుదీర్ఘ ప్రయాణమని విలియం ప్యాటర్‌సన్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ మీర్ అలీ హుస్సేన్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా మీర్ అలీ హుస్సేన్ మాట్లాడుతూ నిరంతర విద్య, దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో శ్రీనిధి సంస్థ చైర్మన్ డాక్టర్ కేటీ.మహే, సీఈఓ డాక్టర్ అభిజిత్‌రావు, ప్రిన్సిపల్ టి.సీహెచ్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా నుంచి తమ్ముడినంటూ..

జిన్నారం(పటాన్‌చెరు): అమెరికాలో ఉంటున్న తమ్ముడినంటూ అక్కతో చాట్ చేసి రూ.70వేలు కాజేసిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారంలో జరిగింది. సీఐ గంగాధర్ కథనం ప్రకారం..బొల్లారం మున్సిపల్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో భార్యాభర్తలు మధు, ఆశారాణి నివాసం ఉంటున్నారు. ఆశారాణి తమ్ముడు కార్తీక్ అమెరికాలో ఉంటున్నాడు. ఐతే కార్తీక్ లాగా అక్క ఆశారాణితో చాట్ చేసి తనకు అర్జెంటుగా రూ.70వేలు కావాలని అడగగా నమ్మిన ఆశారాణి ఆన్‌లైన్‌ద్వారా రూ.70వేల నగదును ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు మరో రూ.30వేలు కావాలని అడగగా అనుమానం వచ్చిన ఆశారాణి తన తమ్ముడైన కార్తీక్‌కు ఫోన్ చేసి మాట్లాడగా తాను డబ్బు అడగలేదని స్పష్టం చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి శుక్రవారం బొల్లారం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

బోనాల సంబరాలు



విద్యాంజలి హైస్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణం సీతారాంపురం కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం బోనాల సంబరాలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలతో చిన్నారులు కనువిందు చేశారు. స్కూల్‌లో బోనాలకు పూజలు చేసిన అనంతరం చిన్నారులు బోనాలు ఎత్తుకున్నారు. సంబరాలు నేత్ర పర్వంగా సాగాయి.

విద్యాంజలి హైస్కూల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలోని విద్యాంజలి హైస్కూల్‌లో బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో సంబరాల్లో పాల్గొన్నారు. అమ్మవారిని అలకరించి తొట్టెలను, బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. బోనాల పండుగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, అడ్వైజర్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పోతురాజుల వేషధారణలో చిన్నారులు

భారత క్రీడాకారులకు ‘మనూ’ శుభాకాంక్షలు



రాయదుర్గం: పారిస్ ఒలంపిక్స్–24లో భారత్ భారీగా పతకాలను సాధించాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ ఆకాంక్షించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ జే రాజేష్, డాక్టర్ మహ్మద్ హబీబుల్లా, అసిస్టెంట్ ఇంజనీర్ ఎంఏ హఫీజ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీఎం ఏ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కల చిత్రపటాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసినగర్ కాలనీలో 30 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో సీసీ రోడ్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, సిహెచ్. భాస్కర్, యాదగిరి, సంగమేష్, మల్లేష్ గౌడ్, రమేష్, జనార్దన్, నవీన్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పంచముఖి హనుమాన్ దేవస్థానం నూతన అధ్యక్షునిగా మనోహర్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పంచముఖ వీరాంజనేయస్వామి దేవస్థానం నూతన అధ్యక్షునిగా కొండా మనోహర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. దీంతో కార్పొరేటర్ సమక్షంలో మనోహర్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ మాట్లాడుతూ... నూతన అధ్యక్షుడు మనోహర్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జిన్నారం(పటాన్‌చెరు): జాతరను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామంలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న అలీ అబ్బాస్ జాతర పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు దయానంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి

ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ మిథిలేష్ సాయిసన్నారెడ్డి



ఐటీసీ కోహినూర్‌లో ప్రముఖ కంపెనీల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ, ఆర్థిక నిపుణుడు మిథిలేష్ సాయిసన్నారెడ్డి సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం ప్రముఖ కంపెనీల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంగంలోకి వచ్చే కొత్త సీఏలు ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం ద్వారా తమ క్లయింట్లకు సరైన సేవలు అందించగలుగుతారన్నారు.

సరిపడా నీరు సరఫరా చేయాలి

రాయదుర్గం: తమకు సరిపడా నీరు సరఫరా చేయాలని గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీవాసులు కోరుతున్నారు. జూన్, జూలై నెలల్లో తగినంత నీరు సరఫరా కావడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈకి ఫోన్ చేస్తే మీ కాలనీ కోటా వదులుతున్నామని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.